సాక్షి నిజామాబాద్

సోమవారం। 19। మే। 2025



వరద గేట్లకు మరమ్మతులు..

శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ మిగులు జలాలను గోదావరిలోకి వదులుటకు నిర్మించిన వరద గేట్లకు మరమ్మతులు పూర్తయ్యాయి.

- 8లో ▸



అన్నదాతపై విత్తన భారం

భూసారం పెంచే జీలుగ విత్తనాల ధర పెంచడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. తమపై భారం పడుతోందని అంటున్నారు.

- 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 39.7 /24.5

ఉదయం ఆహ్లాదకరంగా ఉంటుంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ ఉరుములుమెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

ర్యాష్ డ్రైవింగ్.. రోడ్డుపై నిలబెట్టింది





ఖలీల్‌వాడి: ర్యాష్ డ్రైవింగ్ చేసిన ఇద్దరు యువకులను స్వయంగా పట్టుకున్న సీపీ సాయిచైతన్య వారిని సామాజిక సేవ చేయాలని సూచించారు. శనివారం రాత్రి నగరంలోని కోర్టు చౌరస్తా మీదుగా ఇద్దరు యువకులు బైక్ ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ సీపీ వాహనం పక్కనుంచే వెళ్లగా ఆయన గమనించి వెంటనే వారిని పట్టుకున్నారు. సదరు యువకులను ఒకరిని ఎన్టీఆర్ చౌరస్తా, మరొకరిని కోర్టు చౌరస్తాలో నిలబెట్టి వాహనదారులకు హెల్మెట్ ఆవశ్యకతపై అవగాహన కల్పించాలని సూచించారు. దీంతో ఇద్దరు యువకులు ఆదివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ప్లకార్డులను చేత పట్టుకుని ప్రదర్శించారు.

రైతుబంధు నిధులు విడుదల చేయాలి

- వ్యవసాయశాఖ మంత్రికి ఎన్‌డీసీసీబీ చైర్మన్ రమేశ్‌రెడ్డి వినతి




సుభాష్‌నగర్: యాసంగి సీజన్‌కు సంబంధించి నాలుగు ఎకరాలపైన రైతులకు రైతుబంధు నిధులు విడుదల చేయాలని ఎన్‌డీసీసీబీ చైర్మన్ కుంట రమేశ్‌రెడ్డి కోరారు. ఈ మేరకు ఆదివారం వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును హైదరాబాద్‌లోని తన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రభుత్వం యాసంగి సీజన్‌లో నాలుగు ఎకరాల వరకు మాత్రమే రైతుబంధు నిధులు జమ చేసిందని, మిగతా రైతులకు త్వ రగా విడుదల చేయాలని కోరారు. అదేవిధంగా ఉమ్మడి జిల్లాలో సాంకేతిక కారణాలతో మాఫీ పొందని రైతులకు కూడా రుణమాఫీ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇందుకు ఆయన సానుకూలంగా స్పందించి సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి త్వరలోనే నిధులు జమ చేసేలా చూస్తానని మంత్రి హామీ ఇచ్చినట్లు రమేశ్‌రెడ్డి తెలిపారు.

కానిస్టేబుల్‌పై కేసు

నిజామాబాద్ రూరల్: అధిక వడ్డీ వసూలు చేస్తున్న కానిస్టేబుల్‌పై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్‌హెచ్‌వో ఆరీఫ్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఇందిరప్రియదర్శిని కాలనీకి చెందిన కాలేబార్ గంగాధర్ మెండోరా పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. ఓ మహిళకు రూ.8 లక్షలు అప్పుగా ఇచ్చిన గంగాధర్ ఆమెకు చెందిన ఆస్తిపత్రాలను సేల్ డీడ్ చేసుకోవడంతోపాటు ఐదు శాతం వడ్డీ వసూలు చేస్తున్నాడు. ఇదిలా ఉండగా సేల్‌డీడ్ చేసుకున్న ఆస్తిని గంగాధర్ వేరొకరికి విక్రయించినట్లు తెలుసుకున్న మహిళ రూరల్ పోలీసులు ఆశ్రయించింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు. అధిక వడ్డీలు వసూలు చేసే వారి వివరాలను తమకు అందించాలని, సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు.

హైవే రిస్క్

- జాతీయ రహదారులపై తరచూ ప్రమాదాలు
- ఎన్‌హెచ్- 44పై 12, ఎన్‌హెచ్- 63పై 26 బ్లాక్ స్పాట్‌లు
- అతివేగం, మానవ తప్పిదాలే ప్రమాదాలకు కారణం



జాతీయ రహదారి 63: ఆరు రోజుల క్రితం ఆర్మూర్ మండలంలోని చేపూర్ సాయి బాబా మందిరం మూలమలుపు వద్ద బైక్, డీసీఎం ఢీకొని ఆర్మూర్‌కు చెందిన నాగార్జున, నాగేంద్ర మృతి చెందారు.



జాతీయ రహదారి 44: ఏప్రిల్ 20న పెర్కిట్ మహిళా ప్రాంగణం వద్ద బైక్, లారీ ఢీకొని ఆర్మూర్‌లోని జెండాగల్లీకి చెందిన ఓంకార్, విశ్వనాథ్, భాను ప్రసాద్ మృతి చెందారు.

ఎన్‌హెచ్-44పై బ్లాక్‌స్పాట్లు

మండలం	ప్రాంతాలు
మెండోరా	దుదిగాం వద్ద ఉన్న కోతి టెంపుల్ దగ్గర
ముప్కాల్	ముప్కాల్ ఎక్స్ రోడ్డు
బాల్కొండ	అండర్ బ్రిడ్జి, ఐఓసీ పెట్రోల్ బంక్, చిట్టాపూర్ ఎక్స్‌రోడ్డు
ఆర్మూర్	చేపూర్ రిలయన్స్ బంక్, పెర్కిట్ మహిళా ప్రాంగణం, బ్రాహ్మణపల్లి ఎక్స్‌రోడ్డు
జక్రాన్‌పల్లి	అర్గుల్ శ్మశాన వాటిక, మీ వాట్ దాబా, రాజస్థాన్ దాబా
డిచ్‌పల్లి	సాంపల్లి కమాన్, సీఎంసీ, టీటీపూర్-ఫుడ్ కోర్ట్, జెక్ ట్రక్ వీల్ యూటర్న్
ఇందల్వాయి	యూటర్న్, గన్నారం యూటర్న్, చంద్రయాన్‌పల్లి యూటర్న్

ఖలీల్‌వాడి: జిల్లాలోని రెండు ప్రధాన జాతీయ రహదారులపై ప్రమాదాలు నిత్యకృత్యమయ్యాయి. నిర్లక్షంగా వాహనాలు నడుపుతూ కొందరు, మద్యం మత్తులో ర్యాష్ డ్రైవింగ్‌తో మరికొందరు ప్రమాదాలకు కారణమవుతున్నారు. జిల్లా సరిహద్దు ఇందల్వాయి మండలం చంద్రయాన్‌పల్లి శివారులోని అటవీ ప్రాంతం నుంచి మెండోరా మండలంలోని సోన్ బ్రిడ్జి వరకు 71 కి.మీల మేర 44వ నంబర్ జాతీయ రహదారి విస్తరించి ఉంది. బోధన్ మండలంలోని సాలూర నుంచి కమ్మర్‌పల్లి శివారులోని హనుమాన్ టెంపుల్ వరకు 95 కిలోమీటర్ల మేర 63వ నంబర్ జాతీయ విస్తరించింది. రెండు జాతీయ రహదారులపై నిత్యం సుమారు 50 వేల వాహనాలు నడుస్తుంటాయి. కశ్మీర్, కన్యాకుమారి, మహారాష్ట్ర, కర్ణాటక, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు ప్రధాన మార్గం కావడంతో భారీ వాహనాలు, ట్రక్కుల రాకపోకలు ఎక్కువగా ఉంటాయి. ప్రతి రోజు ఏదో ఒక చోట ప్రమాదాలు సంభవిస్తుండడంతో పోలీసులు, నేషనల్ హైవే అధికారులు, ఆర్టీఏ అధికారులు బ్లాక్ స్పాట్‌లను గుర్తించారు. ఎన్‌హెచ్- 44పై 12, ఎన్‌హెచ్-63పై 26 బ్లాక్ స్పాట్‌లుగా పేర్కొన్నారు.

120 కి.మీ వేగంతో ప్రయాణం

జాతీయ రహదారిపై అన్ని రకాల వాహనాలు 80 కిలోమీటర్ల వేగం దాటకుండా ప్రయాణం చేయాలనే నిబంధన ఉంది. కానీ 120 కిలోమీటర్ల వేగంతో వాహనాలను నడిపిస్తున్నారు. దీంతో ప్రమాదాలు ఎక్కువ జరగడానికి ప్రధాన కారణమవుతున్నాయి. జాతీయ రహదారులపై కొన్ని ప్రాంతాల్లో మాత్రమే స్పీడ్ లేజర్ గన్‌లను ఏర్పాటు చేశారు. దీంతో రోజుకు ప్రమాదకరంగా డ్రైవింగ్ చేసే సుమారు 200లకు పైగా వాహనదారులకు ఈ చలాన్‌లను జారీ చేస్తున్నట్లు తెలుస్తోంది. తరచూ ప్రయాణాలు చేసేవారు మాత్రం స్పీడ్‌గన్‌లను గుర్తించి ఆ ప్రాంతాల్లోనే వేగాన్ని తగ్గిస్తుండడం గమనార్హం.

ప్రమాదాలకు కారణాలు..!

- బైక్‌లు, ఆటోలు, కార్లు హైవే పక్కన ఉండే గ్రామాల్లోకి వెళ్లే మలుపుల వద్ద వేగంగా రావడం.
- గ్రామాలకు వెళ్లేందుకు యూటర్న్‌లు లేకపోవడంతో వ్యతిరేక దిశలో ప్రయాణించడం.
- రాత్రివేళల్లో సరైన వెలుతురు లేకపోవడం. రోడ్ల పక్కన ఉండే హోటళ్ల వద్ద వాహనాలు నిలపడం.
- వాహనాలు నడిపే సమయంలో నిద్ర, సెల్‌ఫోన్ డ్రైవింగ్

ఎన్‌హెచ్-63పై బ్లాక్ స్పాట్‌లు

మండలం	ప్రాంతాలు
బోధన్ టౌన్	అంబం ఏఆర్ గేట్
ఎడపల్లి	ఏజాస్ కాలేజీ, మంగళ్‌పాడ్ ఎక్స్‌రోడ్డు, మంగళ్‌పాడ్ దర్గా, సాటాపూర్ గేట్, జాన్కంపేట్ ఎక్స్‌రోడ్డు, అశోక్ సాగర్
నిజామాబాద్	నెహ్రూనగర్, సారంగాపూర్ డెయిరీ, డెయిరీఫారం కమాన్, అర్సపల్లి ఎక్స్‌రోడ్డు, సుభ్‌జిత్ ఫ్యాక్టరీ
మాక్లూర్	మానిక్‌బండార్ బ్రిడ్జి, గుత్ప హనుమాన్ టెంపుల్
ఆర్మూర్	ధోబీఘాట్, సిద్దులగుట్ట, ఆర్టీసీ బస్టాండ్, ఎంజే హాస్పిటల్ రోడ్డు
వేల్పూర్	లక్కోరా కల్వర్టు, మార్కెట్ యార్డు, అంక్సాపూర్ బస్టాండ్
మోర్తాడ్	గాండ్లపేట్ బ్రిడ్జి
కమ్మర్‌పల్లి	గవర్నమెంట్ హాస్పిటల్, పాటి హనుమాన్

అతి వేగంతోనే..

అతి వేగంతో వాహనాలు నడిపించడంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. నిర్ణీత వేగంతోనే వాహనాలు నడపాలి. యూటర్న్‌ల వద్ద జాగ్రత్తగా ఉండాలి. మద్యం సేవించి వాహనాలు నడపరాదు. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు నివారించేందుకు అవకాశం ఉంటుంది.

– రాజావెంకట్‌రెడ్డి, ఏసీపీ, నిజామాబాద్



హైవేపై జరిగిన రోడ్డు ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న సీపీ సాయిచైతన్య, ఎన్‌హెచ్ సిబ్బంది (ఫైల్)

నివారణ మార్గాలు

- కొన్ని యూ టర్న్‌లను పూర్తిగా మూసివేయాలి.
- అనుమతి లేని దాబాలు, వ్యాపార సముదాయాలపై చర్యలు తీసుకోవాలి.
- గుర్తించిన ప్రదేశాలలో సర్వీసు రోడ్లు వేయాలి.
- రేడియం స్టిక్కర్లు, సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలి.
- వాహనాలను పార్కింగ్ ప్రదేశాలలో మాత్రమే నిలిపేలా చర్యలు తీసుకోవాలి.
- హైవేపైకి వచ్చే సమయంలో తక్కువ వేగంతో వాహనాలు వచ్చేలా చూడాలి.

తిరంగా యాత్రకు సంపూర్ణ మద్దతు

- యాత్రలో ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలి
- బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ పటేల్ కులాచారి



మాట్లాడుతున్న దినేశ్ కులాచారి

సుభాష్‌నగర్: ఆపరేషన్ సిందూర్ విజయవంతమైన సందర్భంగా సిటిజన్స్ ఫర్ నేషనల్ సెక్యూరిటీ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం 4 గంటలకు నిర్వహించనున్న తిరంగా యాత్రకు సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ పటేల్ కులాచారి తెలిపారు. ఆదివారం నగరంలోని బీజేపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. శత్రువులకు బుద్ధి చెప్పేందుకు చేపట్టిన ఆపరేషన్ సిందూర్ విజయవంతంగా పూర్తికావడం భారతదేశానికి గర్వకారణమన్నారు. ప్రధాని మోదీ శక్తివంతమైన నాయకత్వంలో తమ ప్రజల రక్షణ కోసం ఎంతకైనా వెనకాడబోమని మరోసారి ప్రపంచానికి తమ దేశం చాటి చెప్పిందని అన్నారు. బీజేపీ నాయకులతోపాటు అన్ని విభాగాల నాయకులు తిరంగయాత్రలో పాల్గొనాలని కోరారు. పార్టీ జిల్లా ప్రధానకార్యదర్శి పోతన్‌కర్ లక్ష్మీనారాయణ, రూరల్ అసెంబ్లీ కన్వీనర్ పద్మారెడ్డి, మాజీ కార్పొరేటర్ ప్రమోద్, మాస్టర్ శంకర్, ఇప్పకాయల సుమిత్ర కిశోర్, ఓంసింగ్, అంబదాస్‌రావు, మల్లేశ్‌గుప్తా, ఆమంద్ విజయ్‌కృష్ణ, భూపతి, కస్తూరికృష్ణ, కిషన్, కార్యకర్తలు పాల్గొన్నారు.

పీఎం స్వనిధి కోసం ఎదురుచూపులు

- వీధి వ్యాపారుల్లో తీవ్ర నిరాశ

ఆర్మూర్‌టౌన్: కరోనా సమయంలో వీధి వ్యాపారులకు ఆర్థికంగా సహాయపడేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన పీఎం స్వనిధి (ప్రధానమంత్రి స్ట్రీట్ వెండర్స్ ఆత్మనిర్భర్ నిధి) పథకం తాత్కాలికంగా నిలిచిపోయింది. రుణాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు అప్లై కాకపోవడంతో నిరాశకు గురవుతున్నారు. బయటి వ్యక్తుల వద్ద వీధి వ్యాపారులు అధిక వడ్డీకి డబ్బులు తీసుకొని ఆర్థికంగా చితికిపోకూడదని, మహిళలు ఆర్థికంగా ఎదగాలనే ఉద్దేశంతో 2020లో పీఎం స్వనిధి పథకం ప్రారంభించారు. ఈ పథకం ద్వారా ఆర్మూర్ మున్సిపాలిటీ పరిధిలో మెప్మా ఆధ్వర్యంలో 6506 మంది వీధి వ్యాపారులను గుర్తించి వారి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయడంతో నేరుగా బ్యాంక్ నుంచి వారి ఖాతాల్లోకి డబ్బులు వచ్చాయి. 3,755మంది రూ.10వేల చొప్పున, 2042 మంది రూ.20 వేల చొప్పున, 707 మంది రూ.50,000 చొప్పున రుణాలు పొంది ఎంతోకొంత ఆర్థికంగా నిలదొక్కుకున్నారు. కానీ ఈ ఏడాది ప్రారంభం నుంచి కొత్త రుణాల కోసం దరఖాస్తు చేసేందుకు వెబ్‌సైట్ ఓపెన్ కావడం లేదు. పాత రుణదారులు తిరిగి రుణం పొందాలన్నా, కొత్త దరఖాస్తుదారులు ఫామ్ నింపాలన్నా అవకాశం లేకపోవడంతో వీధివ్యాపారులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. బ్యాంకు అధికారులు గతంలో రుణాలు పొందిన వారికి మళ్లీ రుణాలు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నప్పటికీ వెబ్‌సైట్ పని చేయడం లేదు.



ఆర్మూర్‌లో పండ్లు విక్రయిస్తున్న వీధివ్యాపారులు

రెండో విడత రుణాల పంపిణీ ఎప్పుడు మొదలవుతుందోనని వీధి వ్యాపారులు అంటున్నారు. రూ.10వేల రుణాల కోసం 113 మంది, రూ.20వేల రుణాల కోసం 257 మంది, రూ.50వేల రుణాల కోసం 218 మంది ఎదురుచూస్తున్నారు.

రుణాలు అందించాలి

మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వం వీధి వ్యాపారుల కోసం తీసుకువచ్చిన పీఎం స్వనిధి పథకం ద్వారా రుణాలు తీసుకునే అవకాశం త్వరగా కల్పించాలి. పెట్టుబడి లేకపోతే వ్యాపారం చేయలేం.

– రాజవ్వ, వీధివ్యాపారి, ఆర్మూర్

ఆర్థిక ఇబ్బందులు వస్తాయి

పీఎం స్వనిధి ద్వారా తీసుకున్న రుణాలు సక్రమంగా చెల్లిస్తున్నాం. ఇప్పుడు రుణాలు ఇవ్వడం ఆగిపోతే మళ్లీ ఆర్థిక ఇబ్బందులు పడాల్సివస్తుంది. వీధివ్యాపారులకు రుణాలు అందిస్తే బాగుంటుంది. – లావణ్య, వీధివ్యాపారి, ఆర్మూర్

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- దేశ చరిత్రలోనే రికార్డు స్థాయిలో ధాన్యం సేకరణ
- నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి



మాట్లాడుతున్న రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

ధర్పల్లి: ప్రతిపక్షాలు ఎన్ని అడ్డంకులు సృష్టించినా ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు పోతోందని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి అన్నారు. ధర్పల్లి మండల కేంద్రంలో ఆదివారం పలు కార్యక్రమాలకు హాజరైన ఆయన స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. కాళేశ్వరం నీళ్లు లేకపోయినా తెలంగాణలో రికార్డు స్థాయిలో 2కోట్ల 50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటయ్యాక సేకరించామన్నారు. ఇది దేశ చరిత్రలోనే రికార్డు అని అన్నారు. జిల్లాలో 9 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించినట్లు తెలిపారు. మరో వారం రోజుల్లోనే రూ.500 బోనస్‌ను అందిస్తామన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పేరిట అ ధికారులు లేదా తమ పార్టీ నాయకులు డబ్బు లు అడిగితే నేరుగా తనకే ఫోన చేయాలని సూచించారు. పథకాల అమలులో అవినీతిని సహించేది లేదని హెచ్చరించారు. బీఆర్‌ఎస్‌లో ఆధిపత్య పోరు నడుస్తోందని, ఆ పార్టీ ప్రజలు ఎప్పుడో మరిచిపోయారన్నారు. ఇంద్రగిరి ఆవాస్ పథకం ద్వారా గిరిజనుల భూముల్లో బోరు బావులు, సోలార్, డ్రిప్ ఇరిగేషన్ వంటి సౌకర్యాల కోసం రూ.12500 కోట్లు కేటాయిస్తామని, ఈ పథకాన్ని త్వరలోనే సీఎం రేవంత్‌రెడ్డి లాంఛనంగా ప్రారంభిస్తారని ఆయన ప్రకటించారు. నాయకులు మునిపల్లి సాయిరెడ్డి, మల్లికార్జున్, చెలిమెల నర్సయ్య, ఆర్మూర్ బాలరాజ్, గంగారెడ్డి, భగవాన్‌రెడ్డి, గంగారెడ్డి పాల్గొన్నారు.

యశోద మెడికల్ సెంటర్

యశోద హాస్పిటల్స్

హెచ్‌డీఎఫ్‌సి బ్యాంక్ ఎదురుగా, హైదరాబాద్ రోడ్, నిజామాబాద్

సూపర్ స్పెషాలిటీ వైద్యనిపుణులు మీ చేరువలో

ప్రత్యేకతలు	వైద్యులు	తేది - సమయం
మెదడు, వెన్నెముక, మరియు నరాల వ్యాధులకు కన్సల్టేషన్: నడుము నొప్పి, మెడ నొప్పి, కాళ్ళు, చేతులు తిమ్మిర్లు, నరాల ఒత్తిడి సమస్యలు, వెన్నెముక (ఫ్రాక్చర్ ట్రీట్‌మెంట్స్), పార్శ్వగూని చికిత్స, వెన్నెముక ఇన్ఫెక్షన్, అడ్వాన్స్‌డ్ స్పైనల్ టెక్నిక్స్	డా॥ బాల రాజశేఖర్ చంద్ర MS, M.Ch [illegible]	20-05-2025 ఉదయం10 గం॥ నుండి మధ్యాహ్నం 3 గం॥ వరకు
కిడ్నీ వ్యాధులకు కన్సల్టేషన్: కిడ్నీ మార్పిడి అవసరం ఉన్న వాళ్ళు, డయాబెటిస్ వల్ల వచ్చే కిడ్నీ వ్యాధులు, అధిక రక్తపోటు, మధుమేహం వ్యాధిగ్రస్తులలో మూత్రపిండాల సమస్యలు, క్రానిక్ & ఎక్యూట్ కిడ్నీ వ్యాధి సమస్యలు, హీమో డయాలసిస్ మరియు పెరిటోనియల్ డయాలసిస్ సమస్యలు	డా॥ మామిడి ప్రణీత్ రామ్ MBBS, MD, DM (Nephrology) కన్సల్టెంట్ నెఫ్రాలజిస్ట్ & రీనల్ ట్రాన్స్‌ప్లాంట్ ఫిజీషియన్	21-05-2025 3వ బుధవారం ఉదయం10 గం॥ నుండి మధ్యాహ్నం 3 గం॥ వరకు
భుజం & మోకాళ్ళ స్పెషలిస్ట్ కన్సల్టేషన్: భుజం మరియు మోకాళ్ళకు కీ హోల్ సర్జరీ, కంప్యూటర్ నేవిగేషన్ పద్ధతి ద్వారా భుజం మరియు మోకాళ్ళ మార్పిడి, మోకాళ్ళ లిగ్మెంట్ గాయాలు, భుజం గూడు తప్పుట & కండరం చిరుగు, మృదులాస్థి (కార్టిలేజ్) సర్జరీ, స్పైనల్ చికిత్స	డా॥ సుకేష్ రావు సంకినేని MS (Orthopaedics), [illegible] కన్సల్టెంట్ షోల్డర్ సర్జన్, ఆర్థోపెడిక్స్ మరియు జాయింట్ రీప్లేస్‌మెంట్	
గుండె వ్యాధులకు కన్సల్టేషన్: పుట్టుకతో వచ్చే గుండెజబ్బులు, హార్ట్ ఎటాక్, అధిక రక్తపోటు, గుండె దడ, ఆయాసం, ఇతర అన్ని రకముల గుండె జబ్బులు కలవారు	డా॥ రోహిత్ పి. రెడ్డి MD, DM (Cardiology) ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్	
ఊపిరితిత్తుల వ్యాధుల కన్సల్టేషన్: దీర్ఘకాలిక దగ్గు, శ్వాసలో గురక, శ్వాస తీసుకోవటంలో కష్టం, ఊపిరితిత్తులలో ఇన్ఫెక్షన్, ఊపిరితిత్తుల క్యాన్సర్, టీబీ (క్షయ), ఆస్తమా మరియు అలర్జీ	డా॥ వి. ప్రతిభ్ ప్రసాద్ MBBS, DNB (Pulmonology) కన్సల్టెంట్ ఇంటర్వెన్షనల్ పల్మనాలజిస్ట్	
రుమటాలజీ కన్సల్టేషన్: కీళ్ళ వాతము, గౌట్, SLE, యాంకైలోజింగ్ స్పాండిలైటిస్, జువెనైల్ ఆర్థరైటిస్, వాస్కులైటిస్, మైయోసైటిస్, బోలు ఎముకల వ్యాధి, పిల్లలు మరియు పెద్దలలో కీళ్ల నొప్పి	డా॥ కీర్తి తలారి MBBS (JIPMER), MD (JIPMER), DM (Rheumatology, NIMS), European LAR Certified in Lupus (Gold Medalist) సీనియర్ కన్సల్టెంట్ రుమటాలజిస్ట్	22-05-2025 4వ గురువారం ఉదయం10 గం॥ నుండి మధ్యాహ్నం 3 గం॥ వరకు
అంకాలజీ కన్సల్టేషన్: రొమ్ము క్యాన్సర్, తల, మెడ క్యాన్సర్, స్త్రీ జననేంద్రియ క్యాన్సర్లు, ఊపిరితిత్తుల క్యాన్సర్, ఎముక మృదు కణజాల క్యాన్సర్,	డా॥ హరీష్ కంచెర్ల MD, DM కన్సల్టెంట్ మెడికల్ హెమటో అంకాలజిస్ట్	
కిడ్నీ వ్యాధులకు కన్సల్టేషన్: కిడ్నీ మార్పిడి అవసరం ఉన్న వాళ్ళు, డయాబెటిస్ వల్ల వచ్చే కిడ్నీ వ్యాధులు, అధిక రక్తపోటు, మధుమేహం వ్యాధిగ్రస్తులలో మూత్రపిండాల సమస్యలు, క్రానిక్ & ఎక్యూట్ కిడ్నీ వ్యాధి సమస్యలు, హీమో డయాలసిస్ మరియు పెరిటోనియల్ డయాలసిస్ సమస్యలు	డా॥ దిలీప్ యం. బాబు MD, DM (Nephrology) కన్సల్టెంట్ నెఫ్రాలజిస్ట్	
కార్డియో థొరాసిక్ సర్జరీ కన్సల్టేషన్: ఛాతిలో నొప్పి, ఊపిరి ఆడకపోవడం (ఆయాసం), గుండె త్వరగా కొట్టుకోవడం, శస్త్రచికిత్స తీసుకోవడంపై రెండవ అభిప్రాయం, బీటో & అయోర్టిక్ సహా కాంప్లెక్స్ కార్డియో సర్జరీస్, ఎం.ఐ.సి.ఎస్., సర్జరీస్ ఫర్ హార్ట్ ఫెయిల్యూర్	డా॥ గిరిధర్ హరిప్రసాద్ [illegible] కన్సల్టెంట్ హార్ట్ ట్రాన్స్‌ప్లాంట్ & కార్డియోథొరాసిక్ సర్జన్	24-05-2025 4వ శనివారం ఉదయం10 గం॥ నుండి మధ్యాహ్నం 3 గం॥ వరకు
సర్జికల్ అంకాలజీ కన్సల్టేషన్: రోబోటిక్ & లాపరోస్కోపిక్ సర్జరీలు, రొమ్ము క్యాన్సర్, తల & మెడ క్యాన్సర్, స్త్రీ జననేంద్రియ క్యాన్సర్లు, కీమో & రేడియేషన్ థెరపీ, జీర్ణాశయాంతర క్యాన్సర్లు – ఎముక & మృదు కణజాల క్యాన్సర్, ఊపిరితిత్తుల క్యాన్సర్	డా॥ సచిన్ మర్ద MBBS, DNB, M.Ch (TMH Mumbai) కన్సల్టెంట్ సర్జికల్ అంకాలజిస్ట్, [illegible]	28-05-2025 4వ బుధవారం ఉదయం10 గం॥ నుండి మధ్యాహ్నం 3 గం॥ వరకు

అపాయింట్‌మెంట్ కొరకు: 707 570 9496 | 709 368 3939

భవిత కేంద్రాలకు మహర్దశ

- జిల్లాలోని ఏడు కేంద్రాలకు రూ.14 లక్షల టీఎల్‌ఎం
- నిజామాబాద్‌లో 29 కేంద్రాల మరమ్మతులకు రూ.68.05 లక్షలు,
- కామారెడ్డిలో 22 కేంద్రాలకు రూ.51.62 లక్షలు మంజూరు



ఆర్మూర్: సమగ్ర శిక్ష సహిత విద్యా విభాగంలోని దివ్యాంగ విద్యార్థులకు మరింత మెరుగైన శిక్షణనిచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుంటోంది. అందులో భాగంగా భవిత కేంద్రాల్లో టీచింగ్ లర్నింగ్ మెటీరియల్ (టీఎల్‌ఎమ్)తోపాటు భవనాల మరమ్మతులకు రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణ ప్రత్యేకంగా నిధులు మంజూరు చేశారు. దీంతో ఉమ్మడి జిల్లాలోని దివ్యాంగ విద్యార్థులకు భవిత కేంద్రాల్లో అవాంతరాలు లేని పరిసరాల్లో విద్యా బోధన చేయడానికి ఏర్పాట్లు చేయనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 33 జిల్లాల్లో శాశ్వత భవనాలు ఉన్న 156 భవిత కేంద్రాలకు, ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహిస్తున్న 446 కేంద్రాలకు కలిపి మొత్తం 602 భవిత కేంద్రాల మరమ్మతులకు రూ. 14 కోట్ల 12 లక్షల 73 వేలు మంజూరు చేశారు.

ఉమ్మడి జిల్లాలో మరమ్మతుల కోసం..

నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో భవిత కేంద్రాల మరమ్మతులకు నిధులు మంజూరయ్యాయి. నిజామాబాద్ జిల్లాలోని శాశ్వత భవనాలు ఉన్న ఏడు కేంద్రాలతోపాటు ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహిస్తున్న 22 కేంద్రాల్లో మరమ్మతుల కోసం రూ.68,05,517 మంజూరు చేశారు. కామారెడ్డి జిల్లాలో శాశ్వత భవనాలు ఉన్న ఐదు కేంద్రాలతోపాటు ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహిస్తున్న 17 కేంద్రాల్లో మరమ్మతుల కోసం రూ.51,62,806 మంజూరయ్యాయి. మరమ్మతు పనులకు ఇంజినీర్లతో అంచనాలు సైతం రూపొందించారు. ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో భవిత కేంద్రాల్లో ఫ్రెండ్లీ టాయిలెట్లు, ర్యాంపులు, రెయిలింగ్, వాల్ పెయింటింగ్స్, అవసరం ఉన్నచోట భవన నిర్మాణాల మరమ్మతులు చేయించాల్సి ఉంటుంది.

టీఎల్‌ఎం కోసం రూ.2లక్షల చొప్పున..

జిల్లాలోని శాశ్వత భవనాలు ఉన్న నిజామాబాద్, ఆర్మూర్, బోధన్, ఎడపల్లి, మోర్తాడ్, సిరికొండ, నందిపేట్‌లలోని భవిత కేంద్రాలకు టీఎల్‌ఎంతోపాటు అవసరమైన పరికరాల కొనుగోలుకు నిధులు మంజూరయ్యాయి. ప్రతి కేంద్రానికి రూ. రెండు లక్షల చొప్పున రూ.14 లక్షలు కేటాయించారు. జిల్లా విద్యాధికారి సూచనల మేరకు మండలాల ఎంఈవో, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు, భవిత కేంద్రం నిర్వహిస్తున్న ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడితో కలిపి కమిటీ వేసి పరికరాలను కొనుగోలు చేయనున్నారు.

త్వరలో మరమ్మతులు



విశిష్ట ప్రతిభావంతులైన దివ్యాంగులకు భవిత కేంద్రాల్లో ప్రత్యేక విద్యనందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్య లు తీసుకుంటోంది. టీఎల్‌ఎం కొనుగోలు ప్రక్రియ ఇప్పటికే పూర్తయింది. మరమ్మతులను సైతం కలెక్టర్ ఆదేశాలతో త్వరలో పూర్తి చేస్తాం. – అశోక్, డీఈవో, నిజామాబాద్

అవాంతరాలు లేని కేంద్రాలుగా..



దివ్యాంగ విద్యార్థులకు అ వాంతరాలు లేని పరిసరాల తో భవిత కేంద్రాలను ఏర్పా టు చేస్తున్నాం. భవిష్యత్తులో భవిత కేంద్రాల్లో దివ్యాంగులకు బోధన ప్రత్యేకంగా జరగాలనే సంకల్పంతో ముందుకు వెళుతున్నాం.

– పదకంటి శ్రీనివాస్‌రావు, సహిత విద్యా విభాగం జిల్లా కో ఆర్డినేటర్, నిజామాబాద్

క్లుప్తంగా

వాహనాల తనిఖీ

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి పట్టణంలో ఎస్సై మహేశ్ వాహనాలను ఆదివారం తనిఖీ చేశారు. హెల్మెట్ ధరించకుండా వాహనాలను నడపవద్దని వాహనదారులకు సూచించారు. వాహనదారులు వాహనానికి సంబంధించిన ధ్రువపత్రాలను తమ వద్ద ఉంచుకోవాలన్నారు. ట్రిపుల్ రైడింగ్ చేయవద్దని సూచించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులున్నారు.

తాడ్వాయిలో..

తాడ్వాయి: మండలంలోని కామారెడ్డి–ఎల్లారెడ్డి ప్రధాన రహదారిపై పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. లైసెన్స్‌లు, హెల్మెట్లు ధరించని వారికి జరిమానా విధించారు. అలాగే పెండింగ్ చలాన్‌లు ఉన్న వాహనాలకు ఆన్‌లైన్‌లో డబ్బులు కట్టేలా చర్యలు తీసుకున్నారు. తనిఖీలో పోలీసు సిబ్బంది, హోంగార్డులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఫుట్‌బాల్ టోర్నీ



పోటీల్లో తలపడుతున్న నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లా క్రీడాకారులు

నిజామాబాద్ నాగారం: నగరంలోని ఉమెన్స్ కళాశాల మైదానంలో ఉమెన్స్ ఫుట్‌బాల్ లీగ్ టోర్నమెంట్ కొనసాగుతోంది. డాక్టర్ కవితరెడ్డి ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఈ టోర్నీలో క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. ఆదివారం నిర్వహించిన మ్యాచ్‌లో నిజామాబాద్, ఆదిలాబాద్ జట్ల మధ్య పోటీ జరిగింది. కోచ్ నాగరాజు పర్యవేక్షణలో ఫుట్‌బాల్ పోటీలు జరుగుతున్నాయి. మ్యాచ్‌లను డాక్టర్ కవిత రెడ్డి, డాక్టర్ జలగం తిరుపతిరావు, న్యాయవాదులు, అధికారులు వీక్షించారు.



మ్యాచ్‌ను వీక్షిస్తున్న నిర్వాహకులు

ప్రాజెక్టుల గేట్ల నిర్వహణ గాలికి!



నిజాంసాగర్ ప్రాజెక్టు వరద గేట్ల ప్రాంతం

- గ్రీసింగ్, ఆయిలింగ్ కరువు
- పనులకు ముందుకు రాని కాంట్రాక్టర్లు
- పట్టించుకోని అధికారులు

నిజాంసాగర్: ఉమ్మడి నిజామాబాద్ జిల్లా వరప్రదాయని అయిన నిజాంసాగర్ ప్రాజెక్టు వరద గేట్ల నిర్వహణను గాలికి వదిలేశారు. ఏటా వర్షాకాలం ప్రారంభానికి రెండు నెలల ముందే ప్రాజెక్టు వరద గేట్లకు గ్రీసింగ్, ఆయిలింగ్ చేయించాల్సి ఉంది. మరో పక్షం రోజుల్లో వర్షాకాలం సీజన్ ప్రారంభం కానున్నా.. ఇప్పటికీ పనుల ఊసే లేదు.

నిజాంసాగర్ ప్రాజెక్టు వరద గేట్లతో పాటు కల్యాణి, సింగితం రిజర్వాయర్ వరద గేట్లకు గ్రీసింగ్, ఆయిలింగ్ పనుల కోసం ప్రభుత్వం రూ. 8 లక్షలు మంజూరు చేసింది. కానీ ఈ పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకురావడం లేదు. రిస్క్‌తో కూడుకున్న పనులు కావడం, పనులు చేసినా సకాలంలో బిల్లులు రాకపోవడంతో కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదని తెలుస్తోంది. మరోవైపు సింగితం రిజర్వాయర్ వరద గేట్లను ఎత్తే రాడ్ వంగిపోయింది. దీంతో ప్రమాదపు అంచున్న గేట్లున్నాయి.

“ టెండర్లకు ముందుకు రావడం లేదు



నిజాంసాగర్ ప్రాజెక్టు 20 గేట్లకు గ్రీసింగ్, ఆయిలింగ్ పనుల కోసం మూడోసారి కూడా టెండర్లు పిలిచాం. కానీ పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. గేట్లకు గ్రీసింగ్, ఆయిలింగ్ పనులు చేయించేందుకు చర్యలు తీసుకుంటాం.

– సోలోమన్, నీటిపారుదలశాఖ ఈఈ, నిజాంసాగర్

‘సింగితం’ వరద గేట్ల రాడ్లను బాగుతో పాటు గ్రీసింగ్, ఆయిలింగ్ పనులకు ప్రతిపాదించినా పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు జంకుతున్నారు.

నిజాంసాగర్ గేట్లదీ అదే పరిస్థితి..

నిజాంసాగర్ ప్రాజెక్టు 20 గేట్ల ఓవరాయిలింగ్‌తోపాటు గ్రీసింగ్, ఆయిలింగ్ పనులకు ప్రభుత్వం రూ. 39 లక్షలు మంజూరు చేసింది. ఈ పనుల కోసం నీటిపారుదల శాఖ అధికారులు మూడుసార్లు టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. దీంతో పనులు చేసేవారు కరువయ్యారు. అధికారులు స్పందించి మరమ్మతులు జరిగేలా చూడాలని కోరుతున్నారు.

ఎస్సారెస్పీ గేట్ల మరమ్మతులు పూర్తి

- 2022లో నిధులు మంజూరు
- మూడేళ్లకు పూర్తయిన పనులు



మరమ్మతులు పూర్తయిన ఎస్సారెస్పీ వరద గేట్లు

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ మిగులు జలాలను గోదావరిలోకి వదులుటకు నిర్మించిన వరద గేట్లకు మరమ్మతులు పూర్తయ్యాయి. ప్రస్తుతం భద్రంగా ఉన్నాయి. ప్రాజెక్ట్ నిర్మాణ కాలంలో 42 వరద గేట్లను నిర్మించగా, 1983లో తొలిసారిగా ప్రాజెక్ట్ నుంచి మిగులు జలాలను గోదావరిలోకి వదిలారు. అప్పటి నుంచి ఉపయోగంలో ఉన్నటువంటి వరద గేట్లకు పూర్తి స్థాయిలో మరమ్మతులు ఎప్పుడూ చేపట్టలేదు. ప్రతి సంవత్సరం వేసవిలో మెయింటెనెన్స్ చేపట్టి వదిలేశారు. దీంతో కొన్ని గేట్లు టన్ బక్కెలు చెడిపోయి, రోప్ తెగిపోయి ప్రమాదకరంగా మారాయి. గేట్లు ఎత్తితే లేవకుండా, దించితే దిగకుండా ఉండిపోయాయి. ఈక్రమంలో గత ప్రభుత్వ హయాంలో 2022లో వరద గేట్ల పూర్తిస్థాయి మరమ్మతుల కోసం రూ.17.5 కోట్ల నిధులను మంజూరు చేసింది. అప్పటి నుంచి ప్రారంభమైన పనులు ఇప్పటికి పూర్తయ్యాయి.

తిప్పలు తప్పినట్టే..

42 వరద గేట్లను ప్రస్తుతం పూర్తిస్థాయిలో మరమ్మతులు పూర్తి కావడంతో అన్ని వరద గేట్లను ఎత్తినా ఎలాంటి తిప్పలు ఉండవని ప్రాజెక్ట్ అధికారులు అంటున్నారు. ప్రతి సంవత్సరం వేసవిలో గేట్ల నిర్వహణ చేపట్టకపోతే మళ్లీ కథ మొదటికొచ్చే ప్రమాదం ఉంది. గేట్ల రోప్‌లకు గ్రీస్, గేట్లకు రంగు వేయడం మరిచిపోతే మళ్లీ టన్ బక్కెలు, రోప్‌లు చెడిపోయే ప్రమాదం ఉంది. ప్రభుత్వం ఏటేటా మెయింటెనెన్స్‌కు నిధులు మంజూరు చేయాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు. వరద గేట్ల ద్వారా 16 లక్షల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి వదిలేలా నిర్మించారు. 1983లోనే తొలిసారి గరిష్ఠంగా అంత స్థాయిలో నీటి విడుదల చేపట్టారు. తరువాత అలాంటి పరిస్థితి ఎదురు కాలేదు. తరువాత కాలంలో గరిష్ఠంగా 6.5 లక్షల క్యూసెక్కుల నీటినే గోదావరిలోకి వదిలినట్లు రికార్డులు తెలుపుతున్నాయి.

“ ఎలాంటి ఇబ్బంది లేదు..

శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ 42 వరద గేట్లకు మరమ్మతులు పూర్తయ్యాయి. ప్రస్తుతం గేట్ల ఆపరేటింగ్‌లో ఎలాంటి ఇబ్బంది లేదు. వరదలు వచ్చినా గోదావరిలోకి నీటిని వదులుటకు 42 వరద గేట్లను వినియోగించుకోవచ్చు.

– వంశీ, డ్యాం ఏఈఈ, ఎస్సారెస్పీ

● అ‘పూర్వ’ సమ్మేళనం

బోధన్: సాలూర మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం 2003–2004కు చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 21 ఏళ్ల తర్వాత అందరూ ఒకే చోట చేరడంతో సంతోషం వ్యక్తం చేశారు. నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. సమ్మేళనానికి ఎంఈవో రాజీ మంజూష, నాటి పాఠశాల ఉపాధ్యాయుడు విశ్రాంత హెచ్‌ఎం గోపాల్ రెడ్డి, ఉపాధ్యాయులు మనోహర్, గురుదత్తు, హన్మాండ్లు, గణేశ్, శ్రీనివాస్, ఇల్తెపు గంగారాంలను ఆహ్వానించి సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు చీల శంకర్, చిద్రపు అశోక్, లక్ష్మణ్, సాయిలు, రాజు, భీంరావు, భీమేశ్, వెంకటేశ్, గంగాప్రసాద్, రవి తదితరులు పాల్గొన్నారు.



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

నేడు అవగాహన ర్యాలీ

రుద్రూర్: మండల కేంద్రంలో వాహనదారుల భద్రత కోసం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం హెల్మెట్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించనున్నట్లు ఎస్సై సాయన్న ఆదివారం తెలిపారు. ర్యాలీ ఉదయం ఎనిమిది గంటలకు రాణంపల్లి నుంచి రుద్రూర్ చౌరస్తా వరకు కొనసాగుతుందన్నారు. ర్యాలీలో ద్విచక్రవాహన దారులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

కొబ్బరి చెట్టుపై పిడుగు

రుద్రూర్: పోతంగల్ మండలం హంగర్గ శివారులో శనివారం సాయంత్రం కొబ్బరి చెట్టుపై పిడుగు పడింది. సాయంత్రం వేళ ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఈ సమయంలో పంట పొలాల్లో గల కొబ్బరి చెట్టుపై పిడుగు పడింది. దీంతో కొబ్బరి చెట్టుపై ఉన్న ఆకులు కాలాయి. ఆదివారం స్థానికులు పిడుగు పడినట్లు గుర్తించారు. పిడుగు పడిన సమయంలో పశువులు, మనుషులు లేనందున ఎలాంటి ప్రమాదం జరగలేదని వారు తెలిపారు.

బాధిత కుటుంబానికి న్యాయం చేయండి

వేల్పూర్: వేల్పూర్‌కు చెందిన మేదరి రాజేశ్వర్ కుమార్తె కావేరి హైదరాబాద్‌లోని మీర్‌పేట్‌లో ఆత్మహత్యకు పాల్పడింది. బీఆర్‌ఎస్ నాయకులు రేగుల్లరాములు, పిట్లసత్యం ద్వారా విషయం తెలుసుకున్న బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని మీర్‌పేట్ ఎస్సైతో ఆదివారం ఫోన్‌లో మాట్లాడారు. కావేరి మృతికి కారకులైన వారిపై కేసు నమోదు చేయాలని కోరారు.



మీర్‌పేట్ ఎస్సైతో ఫోన్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి

నేరాల నిర్మూలనకే కమ్యూనిటీ కాంటాక్ట్



నందిపేటలో ప్రజలతో మాట్లాడుతున్న ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డి

- ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర్ రెడ్డి

నందిపేట్: శాంతి భద్రతల పరిరక్షణ, నేరాల నిర్మూలనకే కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించినట్లు ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర్ రెడ్డి తెలిపారు. నందిపేట మండల కేంద్రంలోని రాజానగర్ దుబ్బ, ఎన్టీఆర్ కాలనీలో ఆదివారం రాత్రి పోలీస్ శాఖ ఆధ్వర్యంలో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం నిర్వహించారు. ప్రజల రక్షణ, శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఏసీపీ తెలిపారు. సుమారు 102 మంది పోలీసు అధికారులు, సిబ్బంది 210 ఇళ్లల్లో తనిఖీలు చేపట్టారు. సరైన ధ్రువపత్రాలు లేని 52 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. అలాగే ముగ్గురు కమ్యూనల్ రౌడీలను, నలుగురు అనుమానిత వ్యక్తులను చెక్ చేసినటులతెలిపారు. నంబర్ ప్లేట్ లేని, మోడిఫైడ్ సైలెన్సర్లు బిగించిన 12 వాహనాలను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. తనిఖీల్లో ఆర్మూర్ టౌన్ సీఐ సత్యనారాయణ, భీమ్‌గల్ సీఐ సత్యనారాయణ, స్థానిక ఎస్సై చిరంజీవి, ఆర్మూర్ డివిజన్ పరిధిలోని 9 మంది ఎస్సైలు, ఏఎస్సైలు, స్పెషల్ పార్టీ, రిజర్వ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



రాజానగర్‌లో యువకుల వివరాలు తెలుసుకుంటున్న పోలీసులు

క్రైం కార్నర్

దుకాణంలో చోరీకి యత్నం

ఖలీల్‌వాడి: నగరంలోని ఒకటో పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఆర్కే బిల్డర్స్‌లో దుండగులు శనివారం అర్ధరాత్రి చోరీకి యత్నించినట్లు ఎస్‌హెచ్‌వో రఘుపతి ఆదివారం తెలిపారు. దుండగులు బీరువా, లాకర్ ధ్వంసం చేయగా ఎలాంటి వస్తువులు చోరీకి గురి కాలేదన్నారు. ఘటనా స్థలాన్ని పరిశీలించి, క్లూస్ టీమ్ ద్వారా ఆధారాలు సేకరించినట్లు తెలిపారు. దుకాణ నిర్వాహకుడు గుజ్జ రవికృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో పేర్కొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

మద్నూర్: మండలంలోని అంతాపూర్‌లో పేకాట స్థావరంపై దాడి చేసినట్లు ఎస్సై విజయ్‌కొండ తెలిపారు. గ్రామంలో శనివారం రాత్రి పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో దాడి చేసిన నలుగురిని పట్టుకున్నట్లు పేర్కొన్నారు. ఈ దాడిలో రూ. 5,640 నగదు, నాలుగు ఫోన్లు, రెండు బైక్‌లను స్వాధీనం చేసుకొని నలుగురిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. గ్రామాల్లో ఎవరైనా పేకాట ఆడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎస్సై వెంట పోలీసు సిబ్బంది ఉన్నారు.

ఒకరిపై కేసు నమోదు



లింగంపేట: మండలంలోని భవానిపేట శివారులోని పంట చేనులో బండరాళ్లను పగులగొట్టడానికి సదరు వ్యక్తి బ్లాస్టింగ్ చేయడంతో చుట్టు పక్కల ఇళ్లు దెబ్బతిన్నాయని గ్రామస్తులు తెలిపారు. గ్రామానికి చెందిన దర్శనం సిద్ధిరాములుకు సంబంధించిన భూమిలో ల్యాండ్ డెవలప్ చేయడానికి బ్లాస్టింగ్ చేశారు. దీంతో బండరాళ్లు ఎగిరి పలువురి ఇళ్లపై పడడంతో ఇళ్లు, బైక్, కారు ధ్వంసమయ్యాయి. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు ఘటన స్థలానికి ఎస్సై, సిబ్బందితో చేరుకొని పరిశీలించారు. బ్లాస్టింగ్ చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకట్రావు తెలిపారు.

విద్యుత్ షాక్‌తో గేదె మృతి



రుద్రూర్: పోతంగల్ శివారులో ఆదివారం విద్యుత్ షాక్ తగిలి గేదె మృతి చెందింది. గంగారాం అనే రైతుకు చెందిన గేదె వ్యవసాయ పొలం వద్ద మేత మేస్తుండగా ట్రాన్స్‌ఫార్మర్ ఎర్త్‌వైర్‌కు తగిలి విద్యుత్ షాక్‌కు గురైంది. విద్యుత్ షాక్‌తో మృతి చెందిన గేదె విలువ సుమారు రూ.లక్ష వరకు ఉంటుందని బాధిత రైతు తెలిపాడు. ప్రభుత్వం స్పందించి నష్ట పరిహారం ఇవ్వాలని ఆయన కోరాడు.

దుబ్బాకలో..



ధర్పల్లి: మండలంలోని దుబ్బాక గ్రామంలో నాగుల ఎర్రన్నకు చెందిన గేదె విద్యుత్ షాక్‌తో ఆదివారం మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామ సమీపంలో మేత మేస్తుండగా ట్రాన్స్‌ఫార్మర్‌కు తగలడంతో విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. గేదె విలువ రూ.60 వేల వరకు ఉంటుందని, ప్రభుత్వం నష్టపరిహారం అందించాలని బాధితుడు కోరాడు.

అన్నదాతపై విత్తన భారం

- జీలుగ విత్తనాల ధర పెంపుతో రైతుల్లో ఆందోళన
- గతంలో కంటే రెట్టింపు ధరకు విక్రయం
- విత్తనాల కొరతతోనే ఎక్కువ ధరకు కొనుగోలు: విత్తనాభివృద్ధి సంస్థ యాజమాన్యం
- ఇబ్బంది పడుతున్న రైతులు



మోర్తాడ్‌లో జీలుగ విత్తనాలను పంపిణీ చేస్తున్న చైర్మన్ (ఫైల్)

మోర్తాడ్: జీలుగ సాగుతో భూసారం పెరుగుతుంది. అందుకే రైతన్నలు వీటిపై ఆసక్తి చూపుతారు. రాష్ట్ర ప్రభుత్వం జీలుగ విత్తనాలను రాయితీపై అందిస్తుంది. ఈ ఏడాది యాభై శాతం రాయితీపై విత్తనాలను సహకార సంఘాల ద్వారా విక్రయిస్తున్నా గతంలో కంటే ధర రెట్టింపు కావడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జీలుగ విత్తనాల సంచి పరిమాణం 30 కిలోలు ఉండగా గతంలో రాయితీపోను రూ.1,116కు రైతులకు లభించింది. అంటే నాడు ఒక్కో సంచికి రూ.2,232 ఉండేది. ఇప్పుడు సంచి ధర రూ.4,275 ఉండగా 50 శాతం రాయితీపై రూ.2,137కు లభిస్తోంది. గతంలో కంటే రూ.1,021 ధర పెరిగిందని స్పష్టమవుతోంది.

విత్తనాల సేకరణలో ఇబ్బందితోనే..

జీలుగ విత్తనాల సేకరణలో ఇబ్బందులు కలుగడంతో ఎక్కువ ధరకు కొనుగోలు చేయాల్సి వచ్చిందని రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ యాజమాన్యం వెల్లడించింది. జీలుగ విత్తనాలు గతంలో మాదిరిగా తక్కువ ధరకు లభించి ఉంటే అటు రైతులపై, ఇటు ప్రభుత్వంపై భారం ఏర్పడేది కాదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రభుత్వం స్పందించి జీలుగ విత్తనాల ధర పెంపుపై పునరాలోచన చేసి రైతులకు మేలు చేయాలని పలువురు కోరుతున్నారు.

రైతులకు భారమే...

జీలుగ విత్తనాలను ఎక్కువ ధరకు కొనుగోలు చేయడం వల్ల ప్రభుత్వానికి భారం ఏర్పడటమే కాకుండా రైతులకు ఇబ్బందికరమైన పరిస్థితి కలిగింది. జీలుగ విత్తనాలు అందుబాటులో లేకపోవడంతో వీటి సేకరణకు ఎక్కువ ఖర్చు చేయాల్సి వచ్చింది. ఫలితంగా ప్రభుత్వం ఎక్కువ ధరకు కొనుగోలు చేయడంతో ఖజానాకు ఆర్థిక భారం ఏర్పడింది. రాయితీ గతంలో మాదిరిగానే వర్తింప చేసినా ధర పెరగడం వల్ల రైతులపై భారం తప్పలేదని చెప్పవచ్చు.

“ రైతులకు ఆర్థిక నష్టం



జీలుగ విత్తనాల ధర పెంచడం వల్ల రైతులపై తీవ్ర భారం ఏర్పడుతోంది. ప్రభుత్వం ఎక్కువ ధరకు కొనుగోలు చేసిందని రైతులపై భారం వేయడం తగదు. గతంలో రైతులకు ఎంతో తక్కువ ధరకు జీలుగ విత్తనాలు లభించాయి.

– పాపాయి పవన్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్, మోర్తాడ్

రైతులను మోసం చేయడమే



జీలుగ విత్తనాల ధర రెట్టింపు చేయడమంటే రైతులను మోసం చేయడమే. రైతులు ఇప్పటికే కష్టాలు చవి చూస్తున్నారు. మళ్లీ విత్తనాల ధర పెంచడం వల్ల ఆర్థిక భారం ఏర్పడి వారు తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రభుత్వం పునరాలోచన చేయాలి.

– కొలిప్యాక ఉపేంద్ర, మాజీ ఎంపీపీ, ఏర్గట్ల

గత్యంతరం లేని పరిస్థితుల్లోనే..



జీలుగ విత్తనాల సేకరణ విషయంలో మా సంస్థ అధికారులు ఎంత వెతికినా దొరకలేదు. గత్యంతరం లేక ఎక్కువ ధరకు కొనుగోలు చేయాల్సి వచ్చింది. అందుకే ధర పెరిగింది. వచ్చే సీజనుకు చాలా ముందుగానే టెండర్లను ఆహ్వానించి రైతులపై భారం పడకుండా చర్యలు తీసుకుంటాం.

– సుంకెట్ అన్వేష్‌రెడ్డి, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్

బడి బాగుకు ఒక్కటయ్యారు

- సర్కారు బడిలో సదుపాయాల కల్పనకు రూ.10 లక్షలు జమ
- పిల్లలను చేర్పించాలంటూ బడిబాట
- ఆదర్శంగా నిలుస్తున్న ఫరీదుపేట పూర్వ విద్యార్థులు

మాచారెడ్డి : తమకు విద్యాబుద్ధులు నేర్పిన బడి బాగు కోసం పూర్వ విద్యార్థులు నడుం బిగించారు. ఉనికి కోల్పోతున్న చదువుల చెట్టుకు పూర్వ వైభవం తీసుకువచ్చే ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఆ పాఠశాలలో చదువుకొని ఉన్నతంగా ఎదిగిన పలువురు ఉద్యోగులు, వృత్తి నిపుణులు తలా కొంత డబ్బులు జమ చేసి పాఠశాల అభివృద్ధికి పాటుపడుతున్నారు. పాల్వంచ మండలం ఫరీదుపేట గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మౌలిక వసతులు కల్పిస్తున్నారు. ఇప్పటి వరకు జమ చేసిన రూ.10 లక్షలతో పాఠశాలలో విద్య, క్రీడ, కళారంగాల్లో రాణిస్తున్న విద్యార్థులకు ప్రోత్సాహకాలు, ఐఐటీ ఫౌండేషన్, కంప్యూటర్ బోధన, పోటీ పరీక్షల కోసం శిక్షణ, వ్యక్తిత్వ వికాసం తదితర కార్యక్రమాలు చేపట్టనున్నట్లు పూర్వ విద్యార్థులు తెలిపారు.

సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇస్తూ..

పూర్వ విద్యార్థులు ఇటీవల గ్రామంలో బడిబాట నిర్వహించారు. ప్రైవేటు పాఠశాలలకు వెళుతున్న దాదాపు 150 మంది వివరాలను నమోదు చేసుకున్నారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా సౌకర్యాలు కల్పించి నీట్, జేఈఈ, ఏప్‌సెట్ తదితర పరీక్షలకు విద్యార్థులను తీర్చిదిద్దేందుకు అవసరమైన ఫ్యాకల్టీని తాము ఏర్పాటు చేస్తామని తల్లిదండ్రులకు భరోసా ఇచ్చారు. దీంతో చాలామంది తల్లిదండ్రులు తమ పిల్లల్ని సర్కారు బడిలో చేర్పించడానికి ఆసక్తి చూపుతున్నారు.



బడిబాట నిర్వహిస్తున్న పూర్వ విద్యార్థులు (ఫైల్)

“ బడి రుణం తీర్చుకునేందుకు...



ఓనమాలు దిద్దిన బడి రుణం తీర్చుకోవడానికి ఒక్కటిగా కదిలాం. పూర్వ విద్యార్థుల సమావేశం ఏర్పాటు చేసి చర్చించాం. విద్యార్థులకు కార్పొరేట్ స్థాయిలో చదువు అందించేందుకు కలిసి కృషి చేస్తున్నాం.

– వి.శంకర్, అసిస్టెంట్ ప్రొఫెసర్, పూర్వ విద్యార్థి

పాఠశాల అభివృద్ధికి..



మేము చదువుకున్న పాఠశాలను అభివృద్ధి చేయాలని సంకల్పించాం. పాఠశాలలోని సమస్యలను పరిష్కరించడంతో పాటు మెరుగైన విద్యనందించేందుకు సౌకర్యాలు కల్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం.

– ఎం.సిద్ధిరాంరెడ్డి, జిల్లా సైన్స్ అధికారి, పూర్వ విద్యార్థి

అందరూ కదులుతున్నారు



చిన్నప్పుడు చదువుకున్న పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు భరోసా ఇస్తున్నారు. ఈ బడి అభివృద్ధి కోసం ఇక్కడ చదివిన అన్ని బ్యాచ్‌ల విద్యార్థులు ఉత్సాహంగా ముందుకొస్తున్నారు.

– కె.వెంకటి, స్కూల్ అసిస్టెంట్, పూర్వ విద్యార్థి

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

BUSINESS SERVICES

■ మీ బంగారం మణప్పురం ముత్తూట్, మార్వాడీ షాప్స్ ఏ ఇతర ఫైనాన్స్‌లో ఉన్నా మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. 91600 77916 స్పాట్ క్యాష్ [H-783415]

BUSINESS OFFER

■ ITR/Salary Slip లేకుండా 48 గంటల్లో హోమ్‌లోన్ పొందడం కష్టం కాదు. Home First మీకు సహాయం చేయడానికి, సలహాలకి కాల్ చేయండి : 7406393937 [HA-462]

WANTED

STAFF REQUIRED

■ Interested Candidates (including retired bank staff) may apply to work in Bhadradri Co-operative Urban Bank Ltd., Khammam. For details refer website www.bhadradribank.com, Last Date: 31-05-2025. Contact No. 96033 66343. [MH-13471]

■ ఒమేగా హోంకేర్‌లో వృద్ధులను, పేషెంట్లను, పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి భోజనం. జీ: 20K. ఫోన్: 8977639663, 8977639662. [SCA25003891]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి
నిజామాబాద్
CONTACT: 9492010949

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.